తెల్లం గెలుపు కోసం గ్రామాల్లో విస్తృత ప్రచారం

దుమ్ముగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ సీతమ్మ, నాయకులు, వెంకటాపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం, నవంబర్ 25 : భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలుపు కోసం దుమ్ముగూడెం గ్రామంలో శనివారం జడ్పీటీసీ తెల్లం సీతమ్మతోపాటు బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. స్థానికుడు, మండలవాసి తెల్లం వెంకట్రావుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తూరు బాక, నడికుడి, రేగుబల్లి, బుర్రవేముల తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, లంకా శివ, సోడి తిరుపతిరావు, దామెర్ల శ్రీనివాస్, బొల్లి శేఖర్, వెంకన్నరాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.

వెంకటాపురం మండలంలో..

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 25 : భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. శనివారం వెంకటాపురం మండలంలోని పలు గ్రామాల్లో వాజేడు, వెంకటాపురం ఎన్నికల కో కన్వీనర్ గూడవర్తి నర్సింహమూర్తి, వెంకటాపురం మండల అధ్యక్షుడు గంపా రాంబాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటేసి వెంకట్రావుకు ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది చిడెం రవికుమార్, మండల మాజీ అధ్యక్షుడు వేల్పూరి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి పిల్లారశెట్టి మురళి, నాయకులు ముడుంబా శ్రీనివాస్‌రావు, శాంతమూర్తియాదవ్, సమ్మయ్య, శంకర్రావు పాల్గొన్నారు.

జిల్లాకు అదనంగా 500 ఈవీఎంలు

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

గోదాంకు చేరిన ఈవీఎంలను పరిశీలించి సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : జిల్లాకు అదనంగా 500 ఈవీఎంలు కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. నల్గొండ జిల్లా నుంచి 300, ఖమ్మం జిల్లా నుంచి 200 కలిపి మొత్తం 500 ఈవీఎంలు శనివారం రాత్రి ఆర్డీవో కార్యాలయంలోని ఈవీఎం గోదాంకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె అక్కడికి చేరుకొని వాటిని పరిశీలించారు. ఈవీఎంలను ప్రాథమిక స్థాయి మొదటిదశ చెకింగ్ నిర్వహించి ఆయా నియోజకవర్గాలకు పంపనున్నామన్నారు. రిజర్వుడ్‌తోపాటు ఈవీఎంలు అవసరమైన నియోజకవర్గాలకు వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉంచామని, ఈసీఐఎల్ ఇంజినీర్లు తనిఖీ చేసిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పటిష్ట భద్రత మధ్య ఈవీఎంలు గోదాముల్లో భద్రపర్చామన్నారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నుంచి రజాక్, సీపీఎం నుంచి సలీం, కాంగ్రెస్ నుంచి సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 'నవభారత్' విద్యార్థి ప్రతిభ

కాంస్య పతకాన్ని అందుకున్న సాయిశ్రీ వాత్సవ్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 25 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాచుపల్లిలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కొట్టే సాయి శ్రీవాత్సవ్ ప్రతిభ చాటాడు. బ్రెస్ట్ స్ట్రోక్ 200, 50 మీటర్లు విభాగంలోరాణించి రెండు కాంస్య పతకాలు సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు కాంస్య పతకాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని, స్విమ్మింగ్ కోచ్‌లు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ పతకాలు సాధించగలిగానని విద్యార్థి సాయిశ్రీవాత్సవ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సాయిశ్రీవాత్సవ్‌ను నవభారత్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరెడ్డి, కోచ్‌లు శామ్యూల్, రాంబాబు, సంధ్య, హనుమంతరాజు, సామేలు అభినందించారు.

రాజ్యాంగంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరం

జిల్లా జడ్జి పాటిల్ వసంత్

మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్

చుంచుపల్లి, నవంబర్ 25 : రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రతి పౌరుడు బాధ్యతగా, గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. దేశంలో నివసించే అన్నిమతాల ప్రజల మధ్య ఐక్యత సమానత్వం ఉండాలన్నారు. రాజ్యాంగం పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సోదర భావాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.రమేశ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, న్యాయవాదులు లక్కినేని సత్యనారాయణ, అనుబ్రోలు రాంప్రసాదరావు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఎన్‌సీసీ డే

రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 25 : స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీఎం ఎడ్యుకేషన్ వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ నికోలస్, ప్రిన్సిపాల్ చింతా శారద పాల్గొని విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్‌నవీన్ యాదవ్ ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ మణుగూరు, కొత్తగూడెం శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీ, మహిళా కళాశాలలకు చెందని ఎన్‌సీసీ కాడెట్లు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ శ్రీలత, మధు, అనురాధ, శేఖర్, రుచిత పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, నవంబర్ 25 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో శనివారం అంతరాలయంలోని మూలవరులకు స్వర్ణ తులసి పూజలు చేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. స్వామి వారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

అన్నదాన పథకానికి వితరణ

రూ.లక్ష అందజేస్తున్న తెనాలి వాసి కమలకుమారి

భద్రాచలం, నవంబర్ 25 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అన్నదాన పథకానికి గుంటూరు జిల్లా తెనాలి వాసి కమలకుమారి రూ.లక్ష అందజేశారు. శనివారం రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో ఎల్.రమాదేవికి అన్నదానం నిమిత్తం చెక్కును అందజేసి రశీదును స్వీకరించారు. ఆమెకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు కృత్తికా దీపోత్సవానికి అంకురారోపణ

భద్రాచలం, నవంబర్ 25 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం కృత్తికా దీపోత్సవానికి అంకురారోపణ చేయనున్నారు. స్వామివారికి సాయంకాలపు ఆరాధన నిర్వహించి, పవిత్ర గోదావరి నుంచి తీర్థపు బిందెను తీసుకొస్తారు. యాగశాల నుంచి వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, ఆలయ మర్యాదలతో ఈవో రమాదేవి నేతృత్వంలో ఆలయ ప్రదక్షిణ నిర్వహిస్తారు. అనంతరం అంతరాలయంలోకి వెళ్లి మూలవరుల వద్ద భగవత్ ప్రార్థన చేసి తిరిగి యాగశాలకు వచ్చి విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవాచన, పరిషద్రక్షిణ, రక్షాబంధన, పుట్టమన్నుతో పూజ, అంకురారోపణ, వాస్తుహోమం, ద్వార తోరణ పూజ, అఖండ దీపారాధన, వాస్తు హవనం, అంకురారోపణ హవనం జరుపుతారు. ఏకాంత సేవలు రద్దు చేస్తారు.. 27న స్వామివారి నిత్యకల్యాణం జరపరు. ఉదయం బేడా మండపంలో స్వామివారికి 25వెండి కలశాలతో ఆవాహన చేస్తారు. వేదపండితులు పంచ ఉపనిషత్తులతో అభిషేకం నిర్వహిస్తారు.

హనుమాన్ చాలీసా పారాయణం

హనుమాన్ చాలీసా పారాయణం చేసిన మహిళలు

భద్రాచలం, నవంబర్ 25 : భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న బాలదుర్గాదేవి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శనివారం 'స్వర రాగ సుధ భజన మండలి' వారు హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామరక్షా స్తోత్రం పారాయణం చేశారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్య పిలకా నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ వారంరోజులుగా హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతున్నదని, కార్తీక పౌర్ణమి రోజున కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు జవ్వాది వరలక్ష్మి, కొల్లు సునీత, బేబి, ఝాన్సీ, రామలక్ష్మి, అరుణ, మణి, సుశీల, మాధవి, పార్వతి, సాయి, మీరా, భక్తులు పాల్గొన్నారు.